సాక్షి వరంగల్

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



నిధులిస్తేనే నిర్మాణం!

ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- 10లో▸



మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర

మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా ఈ నెల 19వ తేదీన సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలు వెళ్తుందని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు తెలిపారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
$27^0/16^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓకు సన్మానం



గీసుకొండ: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ బాధ్యులు మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావును సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తమ సంఘం సహకారం ఉంటుందని, వైద్య శిబిరాల నిర్వహణలో తోడ్పాటునందిస్తామన్నారు. అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు జి.రాంరెడ్డి, మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోలా రాజేశ్‌కుమార్, కమిటీ సభ్యులు టి.మాధవరెడ్డి, సతీశ్‌రెడ్డి, ప్రసన్నకుమార్, వి.అశోక్‌రెడ్డి, వేణుగోపాల్, అనిల్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు

గీసుకొండ: మండలంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం పాఠశాల, కళాశాలస్థాయి విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీరాధాకృష్ణ ఆధ్యాత్మిక సేవాసంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లూరి కృష్ణమూర్తి, ల్యాద లింగమూర్తి తెలిపారు. 8, 9, 10 తరగతుల వారికి గీతామహత్యం, కర్మయోగం, కళాశాల విద్యార్థులకు గీతామహత్యం, కర్మ, భక్తి, జ్ఞాన యోగానికి సంబంధించిన మెటీరియల్ ఇస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 9 గంటలకు రావాలని వారు కోరారు. విజేతలకు బహుమతులను అందిస్తామని తెలిపారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ

నర్సంపేట: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా రామాలయం ప్రాథమిక పాఠశాల,పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఆహార పదార్థాల నిల్వలు,స్టాక్ చేసుకునే పద్ధతి,వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం శోభ, ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు నల్ల భారతి, బత్తిని శిరీష, ఎండీ. గౌసియా, ఆయా సునీత పాల్గొన్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో కందిమల్ల రమేశ్



నర్సంపేట రూరల్: ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో నర్సంపేట వైద్య కళాశాలకు చెందిన బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ కందిమల్ల రమేశ్ నాలుగోసారి ఎంపికయ్యారు. ప్రపంచంలోని అత్యున్నతమైన యూఎస్‌లోని కాలిఫోర్నియాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం అధికారులు ఆయనను ఎంపికచేశారు. అల్జీమర్స్ వ్యాధి, న్యూరో సైన్స్‌పై చేసిన పరిశోధనలకు గుర్తింపుగా డాక్టర్ ర మేశ్‌ను చండీఘర్‌లో సన్మానించారు.

చెన్నారావుపేట పీఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ

చెన్నారావుపేట: నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ రవీందర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలురకాల రికార్డులు, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట నెక్కొండ ఇన్‌చార్జ్ సీఐ సాయిరమణ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల కోసం 2025 ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి బి.రాజమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలతో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

రుద్రగూడెంలో చోరీ

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెంలో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. రుద్రగూడెం గ్రామానికి చెందిన తౌటురెడ్డి రాజిరెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న రాజిరెడ్డికి తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్రిజ్‌లోని రెండు బీర్లు, బీరువాలోని రూ.10 వేలు కనిపించలేదు. ఈ మేరకు ఆయన పోలీసులకు సమాచారం అందించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

యాప్‌లో లబ్ధిదారుల వివరాల నమోదు కోసం అధికారులకు లాగిన్‌లు

- కార్యదర్శులు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లకు బాధ్యతలు
- ఉమ్మడి జిల్లాలో 42,000 మందికి తొలి విడత లబ్ధి



సంగెం మండలం కుంటపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపికచేసే ప్రక్రియను అధికారులు వేగవంతం చేస్తున్నారు. సర్వేపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేకంగా ఆవిష్కరించిన యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నిక్షిప్తం చేసేలా అధికారులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లకు యాప్ డౌన్‌లోడ్ చేసి యూజర్ ఐడీలు కేటాయిస్తున్నారు. ఇందుకోసం ఉద్యోగుల మెయిల్ ఐడీలు రూపొందించి లాగిన్లు ఇస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తుదారుల వివరాలు ఉంటే ఎక్కువ మందికి లాగిన్లు ఇవ్వాలని నిర్ణయించారు. వీరంతా వెంటనే క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల దగ్గరకు వెళ్లి వివరాలను అప్పటికప్పుడే వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. జనవరిలో సంక్రాంతి నాటికి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించే దిశగా కార్యాచరణ వేగవంతం చేస్తున్నారు. ఈ పథకం కింద నిర్మించే ఇళ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో వంటగది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయన్నారు. మూడు ఆకృతులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు..

ఉమ్మడి జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి,



ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలున్నాయి. ఈ 12 నియోజకవర్గాలకు 42,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించనున్నారు. తొలి విడత సొంత స్థలం ఉన్నవారికి, రెండో విడత స్థలం లేనివారికి ప్రభుత్వమే స్థలమిచ్చి ఇళ్లను మంజూరు చేయనుంది. ప్రజాపాలన సమయంలో మహిళల పేరు మీద దరఖాస్తు తీసుకోగా వారి పేరు మీదనే ఎంపిక చేసేలా అధికారులు కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. గతంలో మాదిరిగానే ఇందిరమ్మ గృహాల మంజూరు, నిర్మాణం, నిధుల విడుదల్లో గోల్‌మాల్ జరగకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారానే సమగ్ర వివరాలు పొందుపరచనున్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగానే ఈ సర్వే చేస్తున్నారు. అర్హులను సైతం ఇందులోనే తేల్చనున్నారు. అలాగే, వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల గృహనిర్మాణ సంస్థను బలోపేతం చేస్తున్నారు. ఇప్పటికే వివిధ విభాగాలకు చెందిన కొందరు అధికారులను తిరిగి ఈ సంస్థకు తీసుకొచ్చారు. మరికొందరు కూడా రానున్నారు. అర్హులైన పేదలకే ఇళ్లను అందించేందుకు వీలుగా ప్రతి గ్రామం, వార్డుల వారీగా 'ఇందిరమ్మ ఇళ్ల కమిటీ'లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

సంగెం: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ, జిల్లా హౌసింగ్ నోడల్ అధికారి జి.రాంరెడ్డి సూచించారు. మండలంలోని కుంటపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుత ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెలు అమ్ముకున్న ముగ్గురి అరెస్ట్

రాంబాబుతో పాటు మరో ఇద్దరు రిమాండ్‌కు తరలింపు

- వేములవాడ గోశాల అధికారుల అండతోనే దందా
- రైతుల పేర సంతకాలు పెట్టి కోడెలను తీసుకువెళ్లారు
- గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్

గీసుకొండ: వేములవాడ రాజన్న కోడెలను అమ్ముకున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ కథనం ప్రకారం.. శ్రీరాజరాజేశ్వర సొసైటీ పేర గోశాల నడుపుతున్న వెలగందుల రాజు, కాంగ్రెస్ నాయకుడు మాదాసి రాంబాబు ఈనెల ఒకటిన వేములవాడ దేవస్థానం నుంచి లేగదూడలు తీసుకుని వచ్చి కబేళాలకు తరలిస్తున్నారు. వారిపై విశ్వహిందూ పరిషత్‌తోపాటు పలువురు గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాంబాబును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడితోపాటు అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తి (ప్రస్తుతం అనంతారం నివాసి)కి చెందిన పశునూరి శ్యాంసుందర్ కలిసి వారి కుటుంబ సభ్యులతోపాటు గీసుకొండ, దుగ్గొండి మండలంలో తెలిసిన రైతుల నుంచి ఆధార్‌కార్డులు, భూమి పత్రాలను సేకరించారు. అనంతరం వేములవాడ గోశాలకు వెళ్లి అక్కడి దేవాలయ అధికారుల సహకారంతో రైతుల సంతకాలను పెట్టారు. రెండు విడతలుగా 66 కోడెలను గీసుకొండ మండలం గట్టుకిందిపల్లిలోని మాదాసి రాంబాబు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న భూమి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించారు. తరలించిన వాటిలో 28 కోడెలను అమ్ముకోగా మరో 26 కోడెలను వేములవాడ గోశాలకు తిరిగి అప్పగించారు.మూడు కోడెలు చనిపోగా, మిగిలిన మరో 9 కోడెలను స్వాధీనం చేసుకున్నామని, దీనికి బాధ్యులైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుల ఫొటోలు కావాలని పోలీసులను విలేకరులు కోరగా.. వారు స్పందించలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకే వారు మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రైతులంటే ఇంత నిర్లక్ష్యమా..?

- ఏపీఎంపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆగ్రహం
- ధాన్యం కొనుగోళ్లు సరిగా లేవని మండిపాటు

సాక్షి ఎఫెక్ట్



ఏపీఎం సునీతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నల్లబెల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ వ్యాపారులు ధాన్యాన్ని ఎలా కొనుగోలు చేస్తున్నారని అదనపు కలెక్టర్ సంధ్యారాణి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంటే ఇంత నిర్లక్ష్యమా అంటూ ఏపీఎం సునీత, సీసీ కవితపై అదనపు కలెక్టర్ మండిపడ్డారు. 'ప్రైవేట్‌కే మొగ్గు..!' శీర్షికన ఈనెల 6న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నల్లబెల్లి, నారక్కపేటలోలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఓ కౌసల్యాదేవితో కలిసి అదనపు కలెక్టర్ మంగళవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. దీంతో రైతులు దాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా పెట్టారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏపీఎం సునీత, సీసీ కవితకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఆర్‌డీఓకు సూచించారు.

అభ్యంతరాలు 12లోగా తెలియజేయాలి..

వరంగల్: ఓటరు, పోలింగ్ డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోగా అధికారులకు చెప్పాలని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన వివిధ రాజకీయ పార్టీల సమావేశంలో ఆమె మాట్లాడారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గం

కాశీబుగ్గ సెంటర్: విద్యాశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం నగరంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఏల్పుల రమణ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సంతోష్, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీకాంత్, పి.జ్యోతి, సహాయ కార్యదర్శిగా వెంకటరాజు, కోశాధికారిగా యు.శిరీష, కార్యాచరణ కార్యదర్శిగా సీహెచ్.శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా పి.సురేశ్, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, రంజిత్, రాహుల్ ఎన్నికయ్యారు. విద్యాశాఖ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌బీ.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి నిరంజన్‌రెడ్డి, నాయకులు కన్నెబోయిన మనోజ్‌కుమార్, జి.త్రినాథ్‌బాబ్జీ, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.దాస్యానాయక్, ఎం.సాంబయ్య పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన కేంద్ర అధికారులు



గంగదేవిపల్లిలో అధికారులు

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని న్యూఢిల్లీ ఐఎస్‌టీఎం అసిస్టెంట్ డైరెక్టర్ (ఫ్యాకల్టీ) లలిత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు కేంద్ర ప్రభుత్వ అధికారులు మంగళవారం సందర్శించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణ తర్వాత గ్రూప్ బీ, సెక్షన్, అసిస్టెంట్ సెక్షన్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, హోం తదితర శాఖల నుంచి మొత్తం 19 మంది గ్రామ సందర్శనకు వచ్చారు. పలు కమిటీల భాగస్వామ్యంతో గ్రామం అభివృద్ధి చెందిన తీరును వారికి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.శంకర్, వరంగల్ రీజియన్ ట్రెయినింగ్ మేనేజర్ మార్గం కుమారస్వామి తెలిపారు. గ్రామం అభివృద్ధి చెందిన తీరు, ప్రజల ఐక్యత, సాధించిన విజయాలు, వచ్చిన అవార్డుల గురించి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వారికి వివరించారు.

గ్రామాల్లోనే ప్రతిభావంతులైన క్రీడాకారులు

- జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి

దుగ్గొండి: గ్రామస్థాయి క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదుగుతారని జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్‌ఓ) సత్యవాణి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో మండలస్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. క్రీడలతో ఐకమత్యం, శారీరక దారుఢ్యం పెరుగడంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గ్రామాల్లోనే ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి, పూలే విద్యాసంస్థల ఆర్‌సీఓ రాజుకుమార్, ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రాజ్‌కుమార్, గ్రామీణ క్రీడాకారులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ

వరంగల్ లీగల్: మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నిర్మలా గీతాంబ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ బిల్డింగ్‌లో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నిర్మలా గీతాంబ మాట్లాడుతూ ఎలాంటి న్యాయ సలహాలకైనా న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి, న్యాయపరంగా లబ్ధి పొందాలని సూచించారు. హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణదేవి, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, బార్ కౌన్సిల్ మెంబర్లు సిరికొండ సంజీవరావు, దుస్స జనార్దన్, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, మాతంగి రమేశ్‌బాబు, మానవ హక్కుల కమిషన్ ప్రతినిధులు అనిల్, సత్య పాల్గొన్నారు.

28 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు

వరంగల్: జిల్లాలోని 28 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో జరిగే పరీక్షల హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం జరిగే పరీక్షల కోసం ఉదయం 8:30 గంటల నుంచి, మధ్యాహ్నం జరిగే పరీక్షల కోసం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాలను సందర్శించాలని, హాల్‌టికెట్లపై ముద్రించిన సూచనలను తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.

బెంగాల్ టైగర్ వచ్చేసింది!

గోదావరి దాటి ములుగు జిల్లాలోకి ప్రవేశించిన పులి

- మల్లూరు గుట్టవైపు వెళ్లినట్లు చెబుతున్న అటవీశాఖ అధికారులు
- వాటర్ పాయింట్లలో క్యాప్చరింగ్‌కు ప్రయత్నం
- ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సీజన్‌లోనూ రాక
- వచ్చింది మగపులిగా నిర్ధారణ
- మేటింగ్ సమయం కావడంతో ఆడపులి కూడా ఉండొచ్చని అనుమానం
- గిరిజనులు జాగ్రత్తగా ఉండాలని సూచన



ములుగు: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు రోజులపాటు కలవరం సృష్టించిన పులి ములుగు జిల్లాలోకి ప్రవేశించినట్లుగా అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. ఆదిలాబాద్, మంచిర్యాల, చెన్నూరు దాటుకుంటూ మంగళవారం గోదావరి తీరం వెంబడి ఉన్న వెంటాపురం(కె) మండలంలోని బోదాపురంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు తమ పరిధిలోని ట్రాపింగ్ కెమెరాలు, అడుగు జాడలు, సంచారానికి సంబంధించిన విషయాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాలోకి వచ్చింది బెంగాల్ టైగర్‌గా గుర్తించారు. బెంగాల్ టైగర్ ఏజెన్సీలోకి రావడం ఇదే మొదటిసారి అని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ సంయోగానికి వచ్చి ఉంటే ఆడపులి ఏటూరునాగారం-కొత్తగూడ వైల్డ్‌లైఫ్ ఏరియాలో ఉండే ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోకి వచ్చిన మగపులి గోదావరి తీరం దాటి వెంకటాపురం(కె) మండలం, మంగపేట మండలం చుంచుపల్లి ఏరియా మీదుగా మల్లూరు గుట్టవైపు వెళ్లినట్లుగా అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పులి జాడలను తెలుసుకోవడానికి గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలతో పాటు ప్రస్తుతం వాటర్ పాయింట్ ఏరియాల్లో కెమెరాలను బిగించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు పులి అలజడికి సంబంధించి ఎలాంటి ఆధారాలూ కెమెరాల్లో క్యాప్చర్ కాలేదని అధికారులు చెబుతున్నారు. బెంగాల్ టైగర్ ఏజెన్సీలోకి ప్రవేశించిన విషయం తెలుసుకున్న గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు.



పులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

మేటింగ్ సీజన్..

ప్రతీఏడాది చలికాలంలో పెద్దపులులు సంయోగం (మేటింగ్) కోసం సంచరిస్తూ ఉంటాయి. అటవీ రికార్డుల ప్రకారం మగపులి ఆడపులితో సంయోగం చెందడానికి వాసన ఆధారంగా ముందుకు అడుగులు వేస్తుంది. ఇదే క్రమంలో ఆడపులి సైతం మగపులి వాసనను పసిగడుతూ అటువైపుగా ఆకర్షితమవుతుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. బెంగాల్ టైగర్‌గా భావిస్తున్న మగపులి ప్రతిరోజూ 20 కిలోమీటర్ల వరకు సంచరిస్తుంది. రాష్ట్ర సరిహద్దులోని ఆదిలాబాద్ నుంచి 120కిలోమీటర్లు దాటి ములుగు జిల్లాలోకి వచ్చిందంటే ఈ పరిధిలో సంయోగానికి మరో ఆడపులి ఉండే ఉంటుందని వన్యప్రాణి ప్రేమికులు చెబుతున్నారు. పులి ఆరు రోజులుగా ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఏజెన్సీలోకి వచ్చినట్లుగా తెలుస్తోంది. పులి సంయోగ సమయంలో ఆందోళనగా ఉంటుందని వన్యప్రాణి విభాగ అధికారులు చెబుతున్నారు. ఈ విషయం తెలియడంతో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల ఆదివాసీ గూడేలు, గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో చలికాలంలో పులులు జిల్లాలోని ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ ఏరియాలో సంచరించినట్లుగా ఆధారాలు ఉన్నాయి. అయితే సంచార సమయంలో జిల్లాలోకి వచ్చిన పులుల్లో ఒకటి ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో వేటగాళ్ల ఉచ్చులకు బలికాగా, మరో రెండు పులులు(ఎస్–1), ఓ చిరుత పులి క్షేమంగా అడవులను దాటుకుంటూ వాటి వాటి గమ్యస్థానాలను చేరుకున్నాయి.

ఉచ్చులకు బలికాకుండా చూసేందుకు ప్రయత్నాలు

2022లో ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోకి వచ్చి గర్భంతో ఉన్న పులి(ఎస్–1) వేటగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లాలోకి వచ్చిన అరుదైన జాతికి చెందిన బెంగాల్ టైగర్ ఎక్కడ వేటగాళ్ల ఉచ్చులకు బలవుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అటవీ శాఖ అధికారులు ముందడుగు వేసి వేటగాళ్లగా గతంలో రికార్డుల్లో ఉన్న వారితో పాటు గ్రామాల వారీగా హెచ్చరికలు జారీ చేసినట్లుగా సమాచారం.

ప్రజలు భయాందోళనకు గురికావొద్దు



జిల్లాలోకి బెంగాల్ టైగర్ ప్రవేశించిన మాట వాస్తవం. ప్రస్తుతం మంగపేట మండలం చుంచుపల్లి- మల్లూరుగుట్ట అటవీ ప్రాంతంలో ఉన్నట్లుగా గుర్తించాం. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. ఉదయం, సాయంత్రం పూట పంట పొలాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ఒంటరిగా వెళ్లొద్దు. సాధ్యమైనంత వరకు గుంపులు, గుంపులుగా ఉండడం మంచింది. ఎక్కడైనా పులి సంచారం వివరాలు తెలిస్తే వెంటనే స్థానిక అటవీ అధికారులకు సమాచారం అందించాలి. అటవీ శాఖ అధికారులు ప్రజలకు అండగా ఉంటారు.

- రాహుల్ కిషన్ జాదవ్, డీఎఫ్‌ఓ

రైతులను ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి: రుణమాఫీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. మండల కేంద్రంలోని ఐఓబీ, పీఎన్‌బీ, డీసీసీబీ బ్యాంకులకు మంగళవారం ఆయన వెళ్లి రైతుల రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐఓబీ పరిధిలో 450 మంది రైతులు ఉండగా.. 22 మందికి మాత్రమే క్లియరెన్స్ వచ్చింది. పీఎన్‌బీలో 456 మంది రైతులకు 356 మందికి మాఫీ అయ్యాయి, డీసీసీబీలో నాలుగు వేల మంది రైతులకు రూ.25 కోట్ల రుణం ఉండగా రూ. 14 కోట్లు మాత్రమే మాఫీ అయ్యిందని ఆయా బ్యాంకుల అధికారులు తెలిపారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడుతూ రైతుబంధుకు రాంరాం చెప్పి రైతు రుణమాఫీ పేరుతో అనేక ఆంక్షలు విధించి రైతులను అరిగోసపెడుతున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసగిస్తున్నాడని ఆరోపించారు. కనీసం అవగాహన లేకుండా ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడుతున్నారన్నారు.

నిధులిస్తేనే నిర్మాణం!

ఏటూరునాగారంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు ఉత్తర్వుల్లో లేని నిధుల ప్రస్తావన
- ప్రాథమిక అంచనా రూ.4.63 కోట్లు
- డిపో నిర్మాణానికి దాదాపు రూ.6 కోట్లకు పైగా అవసరం
- ఎస్టిమేట్ రూపకల్పనలో వరంగల్ రీజియన్ అధికారులు


ఏటూరునాగారం ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయనున్న స్థలం ఇదే ..

హన్మకొండ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) వరంగల్ రీజియన్ పరిధి ములుగు జిల్లా ఏటూరునాగారానికి మంజూరైన బస్ డిపో నిర్మాణానికి నిధులు కీలకం కానున్నాయి. ఏటూరునాగారంలో ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇందులో నిధులపై ఎక్కడా ప్రస్తావన లేదు. దీంతో నిధుల మంజూరుపై సందిగ్ధం నెలకొంది. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో డిపో నిర్మాణానికి అవసరమైన నిధుల ఖర్చు భరించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏటూరునాగారంలో బస్ డిపో మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఉత్తర్వులో నిధుల మంజూరు ప్రస్తావన లేకపోవడంతోపాటు బస్ డిపో నిర్మాణానికి టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు అనుమతిస్తున్నట్లు ఉంది. ఈ క్రమంలో బస్ డిపో నిర్మాణానికి నిధులు ఆర్టీసీ మంజూరు చేయాల్సిందేనా అనే మీమాంస నెలకొంది.

పెరిగిన ప్రయాణికుల రద్దీ

మహాలక్ష్మి పథకంతో రాష్ట్రంలో ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో ప్రస్తుతమున్న బస్సుల సంఖ్య సరిపోవడం లేదు. దీనికితోడు ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన బస్సుల కాలపరిమితి తీరిపోయింది. ఈ క్రమంలో బస్సు డిపో నిర్మాణం, అదనపు బస్సులు సమకూర్చడం వంటి అంశాలు ఖర్చుతో కూడుకున్నవి. దీంతో ఆర్టీసీ పీకల్లోతు కష్టాల్లో ఉన్న ప్రస్తుత సమయంలో కొత్తగా డిపో ఏర్పాటు ఖర్చు భరిస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో నిధులు మంజూరు చేయకపోతే డిపో నిర్మాణం ఉత్తర్వులకే పరిమితం కానుంది. ఈ నేపథ్యంలో ఏటూరునాగారం డిపో నిర్మాణానికి నిధులు మంజూరు ఎక్కడి నుంచి వస్తాయనే విషయం ప్రధానాంశంగా మారింది. ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేస్తే డిపో నిర్మాణం జాప్యం లేకుండా ముందుకు సాగే అవకాశముందని, లేనిపక్షంలో సంస్థనే భరించాల్సి వస్తే నిర్మాణంలో జాప్యం జరిగే అవకాశం ఉండొచ్చనే అభిప్రాయాన్ని ఆర్టీసీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

డిపో నిర్మాణానికి దాదాపు రూ.6 కోట్లకు పైగా నిధులు..

ఏటూరునాగారంలో ఆర్టీసీ డిపో నిర్మాణానికి దాదాపు రూ.6 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రూ.4.63 కోట్లతో ప్రాథమిక అంచనా వేశారు. కాగా, పూర్తి స్థాయి అంచనా రూపొందించి పంపాలని ఆర్టీసీ యాజమాన్యం నుంచి వరంగల్ రీజియన్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇక్కడ డిపో ఏర్పాటుకు స్థలం సమస్య లేనందున ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్మాణపనులు కొనసాగడానికి అన్ని అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఏటూరునాగారంలో డిపో నిర్మాణానికి 3.30 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది.

శాటిలైట్ డిపో ఏర్పాటు..

ఏటూరునాగారంలో ముందు శాటిలైట్ డిపో ఏర్పాటు చేసే అవకాశముంది. 20 నుంచి 30 బస్సుల వరకు ఈ డిపో నుంచి ఆపరేషన్ చేయనున్నారు. ఆ తర్వాత ప్రయాణికుల సంఖ్య, డిమాండ్‌ను బట్టి పూర్తి స్థాయి డిపోగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. వరంగల్-2 డిపో ఆధ్వర్యంలో శాటిలైట్ డిపో కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ప్రస్తుతం ములుగు, ఏటూరునాగారం ప్రాంత గ్రామాలకు వరంగల్-2 డిపో బస్సులు నడుపుతోంది. హనుమకొండ నుంచి ఏటూరునాగారంకు బస్సులు చేరుకుని అక్కడి నుంచి వివిధ రూట్లలో బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏటూరునాగారం డిపో ఏర్పాటుతో హనుమకొండ నుంచి ఏటూరునాగారం వెళ్లి వచ్చేందుకు బస్సుల కయ్యే ఇంధనం ఖర్చు తగ్గనుంది. సకాలంలో నిధులు మంజూరై పనులు మొదలు పెడితే ఏడాదిలో బస్ డిపో నిర్మాణం పూర్తి కానుంది. నిధుల జాప్యం జరిగితే మాత్రం డిపో మంజూరు కాగితాలకే పరిమితం కానుందని పరిశీలకులు భావిస్తున్నారు.

గ్రామాల్లో విస్తరించిన మైక్రో ఫైనాన్స్ దందా

- చేతివాటం ప్రదర్శిస్తున్న రికవరీ ఏజెంట్లు
- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

గార్ల: తమ అవసరాలను ఆసరాగా తీసుకొని తీసుకున్న అప్పు కిస్తీలు కట్టినా కట్టలేదని రికవరీ ఏజెంట్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన నేలం సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇబ్బందికి గురిచేసిన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆమె ఫిర్యాదు చేసింది. మైక్రో ఫైనాన్స్ కంపెనీ గ్రామాల్లో గ్రూపులను తయారుచేసి ముందుగా నేలం సుజాతకు రూ.20,000 అప్పుకు గాను రూ.18000 ఇచ్చారు. 20 నెలల్లో వాయిదా పద్ధతిలో నెలకు రూ.1200 చొప్పున కట్టించుకున్నారు. ఆమె కట్టిన నగదు నుంచి రికవరీ ఆఫీసర్ ఆమెకు తెలియకుండా రూ.3000 డ్రా చేసుకున్నాడు. ఆమె వాయిదా పద్ధతిలో 19 నెలలు కిస్తీలు కట్టానని తెలిపింది. నీవు కిస్తీలు కట్టలేదని ఆమె నుంచి అదనంగా రికవరీ ఏజెంట్ రూ.2000 కట్టించాడని పేర్కొంది. ఈ విషయంపై ఖమ్మంలోని మైక్రో ఫైనాన్స్ కార్యాలయంలో ఆమె ఫిర్యాదు చేయగా, అతను ఆ డబ్బులు కార్యాలయంలో చెల్లిస్తానని ఒప్పుకున్నాడు. రికవరీ ఏజెంట్ వాడుకున్న రూ.2000 అడిగేందుకు మహిళ ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని బాధిత మహిళ పేర్కొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైక్రో ఫైనాన్స్ సంస్థ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని సుజాత డిమాండ్ చేశారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

- ములుగు జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య


లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న అమరేశ్వరి, కొమురయ్య

మామునూరు: గ్రామీణ నిరుద్యోగ యువతకు పెరటి కోళ్ల పెంపకం అధిక లాభదాయకంగా ఉంటోందని, ఈ పథకాన్ని షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య, ఎంఏహెచ్‌ఓ నరసింహులు అన్నారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, పశుపరిశోధన క్షేత్రం అధికారి అమరేశ్వరి ఆధ్వర్యంలో ములుగు జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ తెగల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి సుమారు రూ.10 వేల విలువైన పెరటి కోడి పిల్లలు, కోళ్ల గూళ్లు, దాణ తొట్టిలు, నీటి తొట్టిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెరటి కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయంతోపాటు అదనపు ఆదయాన్ని పొందొచ్చన్నారు. కార్యక్రమంలో పశు పరిశోధన క్షేత్రం కోళ్ల విభాగం శాస్త్రవేత్త ప్రశాంత్‌కుమార్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

డోర్నకల్: డోర్నకల్ మండలం ఫకీరాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తులిశ్యాతండాలో మంగళవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బి.సుక్యా(51) స్నానం చేసిన అనంతరం శరీరం తుడుచుకున్న టవల్‌ను ఇనుపతీగ (దండెం)పై ఆర వేస్తున్నారు. ఈ క్రమంలో ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాలికపై లైంగికదాడి

- వ్యక్తి అరెస్ట్, రిమాండ్

బచ్చన్నపేట : మండలానికి చెందిన ఓ బాలికపై జనగామకు చెందిన ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఎస్‌కే. హమీద్ కథనం ప్రకారం.. సదరు బాలికకు జనగామ పట్టణం బాణపురానికి చెందిన కొండ రాజు మాయ మాటలను చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హమీద్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- దాదాపు రూ.1.50 లక్షల విలువైన ఆభరణాలు చోరీ

ధర్మసాగర్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన ధర్మసాగర్ పీఎస్ పరిధి కాజీపేట మండలం రాంపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆబోతు లక్ష్మి సోమవారం ఇంటికి తాళం వేసి కూలీకి వెళ్లింది. సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా మూడున్నర తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన బాధితురాలు లబోదిబోమంది. ఈ ఆభరణాల విలువ దాదాపు రూ.1.50 లక్షలు ఉంటుందని కన్నీరుమున్నీరైంది. ఈఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

19 నుంచి మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర

- సికింద్రాబాద్ నుంచి భారత్ స్పెషల్ ట్రైన్


మాట్లాడుతున్న ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు

జనగామ : మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా ఈ నెల19వ తేదీన సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలు వెళ్తుందని సౌత్ సెంట్రల్ జోన్ ఐఆర్‌సీటీసీ టూరిజం సేల్స్, మార్కెటింగ్ ప్రతినిధులు ఓర్సు నరేశ్ బాబు, పవన్ కుమార్, శంకర్, సురేశ్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జనగామ రైల్వేస్టేషన్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్-2025 మహాకుంభ మేళాను పురస్కరించుకుని ప్రత్యేక రైలును నడిపిస్తుపిన్నట్లు చెప్పారు. డబుల్, ట్రిపుల్ షేర్, పిల్లలకు సంబంధించి స్లీపర్, ఏసీకి సంబంధించిన టికెట్ల ధరలను నిర్ణయించారు. ఈ యాత్రలో వారణాసి కాశీవిశ్వనాథ ఆలయం, అన్నపూర్ణదేవి, అయోధ్య శ్రీరామ జన్మభూమి, హనార్తి, ప్రజాగ్ రాజ్ త్రివేణి సంగమం పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 040-27702407, 9701360701, 9281495845, 9281495845, 9281495843, 8287932228, 9281030740, 9281030 749, 9281030711, 9281030712 నంబర్లను సంప్రదించాలన్నారు.

12,13 తేదీల్లో బాక్సింగ్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్ : ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ కేటగిరీల్లో ఈ నెల 12, 13వ తేదీల్లో బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పి. రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన సబ్ జూనియర్స్ డిసెంబర్ 20,21వ తేదీల్లో, సీనియర్ క్రీడాకారులు 22, 23వ తేదీల్లో షేక్‌పేట, మున్సిపల్ ఇండోర్ గ్రౌండ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జనవరిలో పాండిచ్చేరిలో జరిగే సౌత్‌జోన్ బాలబాలికల సబ్‌జూనియర్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు, సీనియర్స్‌ను ఉత్తరప్రదేశ్‌లో జరిగే ఎలిట్‌మెన్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సబ్‌జూనియర్స్ కేటగిరీలో ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు జనవరి 2011 నుంచి డిసెంబర్ 2012 మధ్యలో జన్మించిన వారై ఉండాలని, సీనియర్స్ మెన్ కేటగిరీలో పాల్గొనే క్రీడాకారులు 1984 నుంచి 2005వ సంవత్సరం మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, రూ.800 ఎంట్రీ ఫీజుతో హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో ఉదయం 7గంటలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 99597 11609 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

- తీర్పు వెలువరించిన సీనియర్ సివిల్ జడ్జి సురేశ్

మహబూబాబాద్ రూరల్ : హత్యాయత్నం కేసులో నేరం నిరూపణకాబడిన ఒకరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి సి.సురేశ్ మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి బీరం సంపత్‌రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మిలటరీ ఆసుపత్రి బజారులో నివాసం ఉండే చామకూరి స్వరూప 2018 జూన్ 5వ తేదీన తన పిల్లలను తీసుకుని గోల్కొండ రైలు ద్వారా హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. అదే సమయంలో ఆమె సోదరుడు గట్టు రమేశ్ భూతగాదా విషయమై మాట్లాడుతూ స్వరూపతో వాగ్వాదానికి దిగి ఆమెపై దాడిచేసి కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై చీర్ల అరుణ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషిణి కోర్టులో వాదనలు వినిపించగా టౌన్ సీఐ దేవేందర్ పర్యవేక్షణలో సీడీఓలు సంపత్ రెడ్డి, రవీందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న సీనియర్ సివిల్ జడ్జి సురేశ్.. నేరంనిరూపణ కాబడిన గట్టు రమేశ్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి బలవన్మరణం

- తల్లి చనిపోయిందనే మనోవేదనతో కుమారుడు..
- కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య
- అమీనాపురం, లచ్చిరాంతండాలో ఘటనలు


రవి (ఫైల్)


కాళిదాసు మృతదేహం

కేసముద్రం: వేర్వేరు కారణాలతో ఓ యువకుడు, వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమీనాపురం గ్రామం, కేసముద్రంస్టేషన్ శివారు లచ్చిరాంతండాలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. అమీనాపురం గ్రామ బీసీకాలనీకి చెందిన మహేశ్వరం వేణుమాధవ్‌కు ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు ఉమేశ్ తన భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. చిన్నకుమారుడు కాళిదాసు(30) ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో వేణుమాధవ్ భార్య విజయలక్ష్మి నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, తల్లి మృతి చెందినప్పటి నుంచి కాళిదాసు మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారుజామున నిద్రలేచిన తండ్రి వేణుమాధవ్.. కొడుకు గదిలోకి వెళ్లి చూడగా కాళిదాసు అప్పటికే ఉరేసుకుని చనిపోయినట్లు గుర్తించి బోరున విలపించాడు. ఈఘటనపై వేణుమాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లచ్చిరాంతండాలో..

కుటుంబ కలహాలతో కేసముద్రంస్టేషన్ శివారు లచ్చిరాంతండాకు చెందిన బానోతు రవి(40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవి, జానీ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. కాగా, కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రవి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

వరంగల్ ప్రాబబుల్ క్రికెట్ జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీ పరిధిలో జరగనున్న 2024-25 అండర్-14 పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. సెలక్షన్ కమిటీ బాధ్యులు అఫ్జల్, రామకృష్ణ, కుమార్ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ కనబరిచిన 36 మందిని రెడ్, గ్రీన్, ఎల్లో మూడు జట్లుగా విభజించినట్లు తెలిపారు. మూడు జట్లకు నేటి నుంచి సుఖాంత్ మైదానంలో ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహించి అందులో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

భూవివాదం.. చీటింగ్ కేసు నమోదు

డోర్నకల్ : భూవివాదంపై మంగళవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇర్వెండి గ్రామానికి చెందిన కసబోయిన సతీశ్ మండలంలోని ముల్కలపల్లికి చెందిన మధ్యవర్తి కోదాటి రామారావు ద్వారా ఇదే గ్రామానికి చెందిన చెన్నబోయిన ఆంజనేయులుకు చెందిన సర్వే నంబర్ 123/ఏలోని రెండెకరాల భూమిని కొనుగోలు చేశాడు. నాలుగో వంతు డబ్బు అడ్వాన్స్‌గా చెల్లించాడు. తరువాత భూమిని సర్వే చేయించగా ఇందులో 17 గుంటల ప్రభుత్వ భూమి కలిసినట్లు గుర్తించాడు. తనకు భూమి వద్దని, తన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆంజనేయులును కోరాడు. దీనికి అతడు నిరాకరించి గొడవ పడ్డాడు. ఈ ఘటనపై సతీశ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఆంజనేయులుతో పాటు మధ్యవర్తి రామారావుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

రూ. 9.75 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం కోటిలింగాల గుడి సమీపంలో ఐదుగురు వ్యక్తులు రూ. 9,75,000 విలువైన 39 కిలోల ఎండు గంజాయి తరలిస్తుండగా పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ కథనం ప్రకారం.. కోటిలింగాల గుడి సమీపంలో సుందరయ్యనగర్, కాశిబుగ్గకు చెందిన కొమ్ముల సాయికుమార్, కొమండ్ల మణిపాల్, మహ్మద్ అబ్బు, మహ్మద్ అమీర్, లాసాని సాయిరాం.. సంచుల్లో ఎండు గంజాయి రవాణా చేయడానికి సిద్ధంగా ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై కె. కుమార్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసి పరారవుతుండగా వారిని పట్టుకుని తనిఖీ చేయగా రూ. 9,75,000 విలువైన ఎండు గంజాయి లభించింది. దీంతో స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

'ఆలుమగల' సంక్రాంతి..

మేల్, ఫిమేల్ పంట సాగుతో అధిక ఆదాయం ఆర్జిస్తున్న అన్నదాతలు
- ఏజెన్సీలో విత్తనోత్పత్తిలో విరాజిల్లుతున్న కోనాపురం
- రైతులతో ఒప్పందం చేసుకునేందుకు కంపెనీల పోటీ


విత్తనోత్పత్తి కోసం ప్రత్యేక పద్ధతిలో పెంచిన నారుమడి

కొత్తగూడ: ఆలుమగల సంక్రాంతి ఏంటా అని ఆలోచిస్తున్నారా? సాధారణంగా అన్ని గ్రామాల్లో సంక్రాంతికి ఏ పిండి వంటలు చేసుకోవాలి..? ఎలాంటి దుస్తులు కొనుగోలు చేయాలి..? అని ఆలోచిస్తుంటారు. అయితే కొత్తగూడ మండలం కోనాపురం గ్రామంలో మాత్రం ఎవరిని ఎటు వెళ్తున్నావని అడిగితే చాలు.. ఆలుమగల నాటు వేయడానికి, ఆలుమగల పంటకు ఎరువులు చల్లడానికి అంటూ ఎవరి నోటా విన్నా ఆలుమగలు అనే పదం వినిపిస్తుంది.

ఆలుమగలు అంటే..

ఇక్కడి రైతులు వివిధ కంపెనీలతో ఒప్పందం చేసుకుని విత్తనోత్పత్తి చేస్తుంటారు. విత్తనోత్పత్తిలో వేసే నాట్లు రెండు లైన్లను మగ (మేల్), మధ్యలో అయిదు వరుసలను ఆడ(ఫిమేల్) గా పిలుస్తారు. పూత దశలో ఈరెండింటిని సంకరం చేస్తుంటారు. అందుకే దీనికి ఇక్కడి రైతులు ఆలుమగల సాగుగా పిలుస్తుంటారు.

ఎక్కువ కష్టం, ఎక్కువ ఆదాయం..

ఈపద్ధతి సాగులో ఎక్కువ కష్టం ఉంటుంది. అయితే కష్టానికి తగిన ఆదాయమూ వస్తుంది. సాధారణ వరి రకం ఎకరాకు రూ. 30వేల నుంచి రూ.40వేల ఆదాయం వస్తే ఈ పద్ధతిలో రూ. 70వేల నుంచి రూ. లక్ష వరకు వస్తుంది. ఈసాగు కోసం అన్నదాతలు ముందస్తుగా సిద్ధమవుతారు. నారు పోయడం, కాడి నుంచి.. విత్తనాలు సేకరించే వరకూ అన్ని ప్రత్యేక పద్ధతులు అవలంబించాల్సి ఉంటుంది. నారుమడిని దుమ్ము చేసిన అనంతరం 8 బెడ్లు తయారు చేసుకుని వివిధ దశల్లో అయిదు రోజులు నారు పోస్తారు. అందులో మూడు బెడ్లు మేల్, అయిదు బెడ్లు ఫిమేల్ విత్తనాల నారు పోస్తారు. నారు పోసిన 21 రోజుల్లో నాటు వేస్తారు. ఈ సమయంలో కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండి దారంతో కొలుస్తూ నాట్లు వేయిస్తారు. నాట్లు సరిగా సంక్రాంతికి పూర్తవుతాయి. అనంతరం కంపెనీలు సిఫారసు చేసిన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తారు. మేల్ వరి పూత దశకు వచ్చే సరికి ఫిమేల్ వరి ఈత దశకు చేరుకుంటుంది. అప్పుడు కంపెనీల నిబంధనల ప్రకారం కర్రలతో, తాళ్లతో ఒకదానిపై మరొకదాన్ని దులిపి సంకరం చేస్తుంటారు. ఇలా వారం రోజుల పాటు చేస్తారు. ఎక్కడా లోపం వచ్చినా ధాన్యం మొత్తం తాలు అవుతుంది. అలా కాకుండా రైతులు వరి పొలాన్ని పసిపాపలా కాపాడుకుంటారు. విత్తనాలైన తరువాత ముందుగా మేల్ వరి సాళ్లను కోసి పక్కన పెడతారు. అనంతరం ఫిమేల్ సాళ్లలో బెరుకులు(ఇతర వంగడాలు) ఏమైనా ఉంటే తొలగిస్తారు. కంపెనీలు కేవలం ఫిమేల్ రకం ధాన్యం మాత్రం కొనుగోలు చేస్తాయి. మేల్ ధాన్యం రైతు తనకు నచ్చిన చోట విక్రయించుకుంటాడు.

పోటీ పడుతున్న కంపెనీలు..

రెండు కంపెనీలు.. వంద ఎకరాలతో ప్రారంభమైన మేల్, ఫిమేల్ సాగు ప్రస్తుతం వెయ్యి ఎకరాల వరకు పెరిగింది. ఇక్కడి రైతులతో ఒప్పందం కుదుర్చుకోవడానికి వివిధ మల్టీనేషన్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. బేయర్, అన్నపూర్ణ, రాశి, కషీదన్, అడ్వాంట, బయోసీడ్, వీఎస్‌ఆర్, కావేరి, నూజివీడు కంపెనీలు ఇక్కడ విత్తనోత్పతి చేస్తున్నాయి. సీడ్, పంట కాలాన్ని బట్టి ఆయా కంపెనీలు రైతులతో ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకుంటాయి. ఒప్పందం ప్రకారం పంట పండితే ఒక విధగా, విత్తనం ఫెయిలైతే మరో రకంగా ఆదాయం అందుతుంది. దీంతో రైతుకు ఎలాంటి నష్టం రాదు.


ప్రత్యేక విధానంలో నాటు వేస్తున్న మహిళలు

పండుగ మీద ధ్యాసే ఉండదు



ఆలుమగల సాగు సమయంలో సంక్రాంతి పండుగ మీద ధ్యాసే ఉండదు. నాట్లు ఎప్పుడు వేస్తామా.. మందు ఎప్పుడు వేయాలా.. నాటు వేయడానికి కూలీలు, ట్రాక్టర్ దొరుకుతారా లేదా అనే ఆలోచనే ఉంటుంది. నాట్లు పూర్తయ్యాకే పండుగ పిండి వంటలు చేసుకుంటాం.

నునుబోతుల లింగన్న, రైతు

ఇక్కడి రైతులు బాగా కష్టం చేస్తారు



ఇక్కడి రైతులు బాగా కష్టం చేస్తారు. కంపెనీలు సూచించిన ప్రకారం పనులు చేసి పంట పండిస్తారు. దీంతో వీరికి ఎక్కువ ఆదాయం వస్తోంది. వీరితో పోల్చి ఇతర గ్రామాల్లో ప్రయత్నం చేశాం కాని ఇంత స్థాయిలో సక్సెస్ కాలేదు. ఇక్కడి రైతుల కమిట్‌మెంట్‌తోనే కంపెనీలు పోటీ పడుతున్నాయి.

కర్ర జనార్దన్ రెడ్డి, డీలర్, బేయర్ కంపెనీ